
# శర్మవంతు




కొడవటిగంటి కృష్ణమూర్తి

'ఇవాళ కాఫీ, చీట్లాట వగైరా మీ ఇంట్లో రాసిపెట్టినాయి శర్మా!' అన్నాడు వస్తూనే పార్వతీశం. వెంట గణపతి వున్నాడు.

'వగైరా కూడానా?' అన్నాడు గణపతి. శర్మ, పార్వతీశం నవ్వేశారు.

'నీకూ్కడా గణపతి చాదస్తం పట్టుకుంటున్నదా ఏమిటి? మగపెళ్లివారిలా దర్జాగా ఆలిస్యం చెయ్యటం మాత్రం, నీకు రాసిపెట్టివుంది!' అన్నాడు శర్మ. తనతప్పు లేనట్టుగా గణపతి నవ్వాడు. అంటే వస్తూ వస్తూ గణపతి దారిలో ఆగి, పార్వతీశాన్ని మామూలుప్రకారం అరగంట ఆలిస్యంగా తీసుకురాగలిగాడు అన్నమాట!

'అది నీకూ్కడా అంటుతుందేమోనని నాకో భయం లేకపోలేదు!' అన్నాడు పార్వతీశం.

'ఏమిటి—ఆలిస్యం చెయ్యటమా?' అన్నాడు గణపతి. శర్మ నవ్వాడు.

'కాదు—నీ వేదాంతం!' అన్నాడు పార్వతీశం. శర్మ మళ్ళీ నవ్వాడు.

'భయందేనికి?' అన్నాడు గణపతి కొంటెగా.

'ఇష్టంలేని విషయం కనక!' అన్నాడు పార్వతీశం విసుగ్గా.

'ఎవరికి—నీకా, శర్మకా?' అన్నాడు గణపతి నవ్వుతూ. పార్వతీశం నీరసంగా చూడటంచూసి 'రాసిపెట్టివుంటే తప్పుతుందా?' అన్నాడు శర్మ. ముగ్గురూ నవ్వేశారు. 'అయినా మా ఇంట్లో కాఫీ, పేకాటకూడా రాసిపెట్టి వుండాలా?' అన్నాడు శర్మ.

'అలా అనకు మరి! అసలివ్వాళ వంతు ప్రకారం మా ఇంట్లోకదూ!' అన్నాడు పార్వతీశం.

'కొంపేమి మునిగేవంతు కాదనుకో—మరి మీ వాళ్ళు అనుకోకుండా వూరికి వెళ్ళాలిసివచ్చిందన్నావుగా నిన్ననే?' అన్నాడు శర్మ.

'కనకనే—మీ ఇంట్లో—రాసిపెట్టి—వుందనటం!' అని పార్వతీశం ఒక్కొక్క మాటను నొక్కుతూ అంటే, అది అతని భావం స్పష్టపరచటమో లేక ఇష్టం లేకుండా నేర్చుకున్న పాఠం అప్పచెప్పటమో శర్మకు అర్థంకాలేదు.

గణపతి లేచి కాలెండర్లు, పటాలు చూస్తున్నాడు. శర్మ ఏదో అనబోతూ అవతలి

హాలులోంచి భార్య పిలవటం చూసి లోపలి కెళ్ళాడు.

శర్మ, పార్వతీశం, గణపతి సన్నిహిత స్నేహితులకింద నే లెక్క. వాళ్ళ వారానికో సాయంత్రం వంతు ప్రకారం ఒక్కొక్కళ్ళ ఇంట్లో కలుసుకుని, పేకాట ఆడుకోవటం రివాజు. అయితే గణపతి 'రాసిపెట్టివుందికామాల!' అనటం మాత్రం అర్థంకాక, శర్మకు ఉడుకు మోత్తనం వస్తూ వుంటుంది. పార్వతీశం కూడా వేడి ఎక్కటం కద్దు. కాని గణపతి చెప్పేదాంట్లో ఒక్కొక్కప్పుడు కొంత నిజంలాంటిది కనిపించటంవల్ల పార్వతీశం ఆ సిద్ధాంతాన్ని 'గణపతి ఉవాచ'గా ప్రకటిస్తాడు. వాళ్ళ స్నేహధర్మం అలా మూడు పాదాల నడుస్తోంది!

'ఇవాళ మా ఇంట్లో చీట్లాటకు వీల్లేదు—అనుకోకుండా బైటికి వెళ్ళాలిసి వచ్చిందంటే?' అన్నాడు శర్మ. మూడు కప్పుల కాఫీతో గదిలోకి వస్తూ. గణపతి మళ్ళీవచ్చి కూచున్నాడు.

'మా కివాళ కాఫీమాత్రమే రాసిపెట్టి వుందంటాడు — గణపతి!' అన్నాడు పార్వతీశం. ముగ్గురూ బిగ్గరగా నవ్వేశారు. వట్టికాఫీ ఇచ్చినందుకూడా పార్వతీశం ఆమాట అనిఫుండకుంగా, అనుకున్నాడు శర్మ.

'నువ్వేదవ్వాటిఫీసు చేస్తేతప్ప లాభం లేదు—తెలిసిందా?' అని ఇంట్లోకి అరిచాడు శర్మ. ముగ్గురూ మళ్ళీ నవ్వారు. ఏదో చూద్దామన్నట్టుగా వచ్చిన శర్మ రెండేళ్ల కూతురు, పెద్దలు నవ్వటంచూసి, లోపలికి వెళ్ళిపోయింది. ముగ్గురూ కాఫీ పూర్తిచేశారు.

'ఇవాళ దొడ్లో ఆడుకుందాం—చల్లగా వుంటుంది' అని శర్మ, దొడ్లో చాపలు వెయ్యమని మళ్ళీ ఇంట్లోకి కేక వేశాడు.

'వాన వస్తుందేమో?' అన్నాడు పార్వతీశం

'రాసిపెట్టివుంటే తప్పుతుందా! అయినా రేడియోలో చెబితే నిన్నట్నుగా అడుగుతున్నానే!' అంటూ పేకను తీసుకొని శర్మ దొడ్లోకి గారితీశాడు.

'అయినా వానలో తడవటం మీకు సరదాగా!' అన్నాడు పార్వతీశం

'వాళ్ళా ఏళ్ళు తిరుగుతూవుంటా రేమో?' అన్నాడు గణపతి.

'పక్క భాగంలో వాళ్ళు పొద్దునే వాళ్ళ పక్కవూరు వెళ్ళారు. రేపుకాని రారు, ఇక మా ఆవిడ, పిల్లే!' అన్నాడు శర్మ.

శర్మ ఇల్లు పాతది—వీధి వివాదకున్నది. ముందు కొద్దిభాగం మెట్లులేని డాబా, వెనక పెంకుటిల్లు. దాదాపు ఖాళీస్థలమంతా దొడ్డివేసే వుంది. పెద్దఇల్లు కాకపోయినా తాము ఇన్తకు సొడికావటంవల్లా, తోడుగా వుంటుందని కొంతబాగాన్ని శర్మ అద్దెకిచ్చాడు. బాదంచెట్టు, ఇంటినానుకునే పైన రేకులతో స్నానాలగది, పక్కనే బావి, రెండు మూడు అరటిచెట్లు, కొబ్బరి చెట్టు, నందివర్ధనం, కరివేపచెట్లు, పారిజాతం, ఎర్రగన్నేరు, పచ్చగన్నేరు—మధ్యలో తులసికోట, పొట్లపాదు, బచ్చలి దుబ్బులు, కందమొక్కలు—అన్నీ చక్కగా సర్దినట్లున్నాయి. శర్మ భార్య వచ్చి కాస్త మేర చిమ్ముతోంది.

పార్వతీశానికి ఆ దొడ్డిచూస్తే ఎంతో ముచ్చటవేసింది. అతను ఓ మేడపైభాగంలో అద్దెకుంటున్నాడు. గణపతికూడా ఓ పెంకుటింట్లో అద్దెకుంటున్నవాడే. గణపతి పొట్లపాదుదగ్గర నిలబడి చిన్నరాయి కట్టి వేళ్ళాడుతున్న పెద్దపొట్లకాయని వానచూస్తుంటే, పార్వతీశం వోగూరింది!

పార్వతీశం అటూ ఇటూచూసి ఓరాయి తీసి, శ్రీమతి శర్మ చీపురుతో ఇంట్లోకి పోగానే, పైన కనిపించిన బాదంపండుకేసి విసిరాడు! ఆ దెబ్బకాపండు విసురుగా అవతల ఏటవాలుగావున్న స్నానాలగది రేకుల మీదపడి, పార్వతీశం చూస్తుండగా, దొర్లుకుంటూవచ్చి బావిలో పడిపోయింది! ఆ చప్పుడుకు రేకులకిందవున్న ఉడత పైకి పారిపోయి స్నానాలగదికీ, ఇంటిచూరుకూ మధ్య గాలికోసం ఏర్పాటయిన కిటికీ చువ్వలు చేరటం, ఆ చువ్వల్లోంచి బైటికి రావటానికి వేళ అయిందా లేదా అని చూస్తున్న ఓ ఎలుక లోపలికే నిష్క్రమించటం, ఒక్కసారి జరిగాయి!

'మాఇంట్లో మనుషులున్నారుగుర్తే!' అన్నాడు శర్మ.

'బాదంపండు ప్రాప్తంలేదోయ్!' అన్నాడు పార్వతీశం.

'ఎందుకులేదో చూస్తాను!' అంటూ శర్మ, చీట్లపేకను గణపతికిచ్చి, బావి దగ్గిరకెళ్ళి బొక్కెనవేసి, ఓనిమిషం శ్రమపడి బొక్కెనడు నీళ్ళతో జిబ్బతిన్న ఆ బాదంపండుతీసి, దాన్ని పార్వతీశానికిచ్చాడు.

'భేష్!' అన్నాడు గణపతి. పార్వతీశం బాదంపండు కొరకటంచూసి, మళ్ళీవచ్చి దొడ్లో చాపలుపరిచి పోతున్న శర్మభార్య మొహం అటు తిప్పుకుని నవ్వేసింది!

స్నేహితులు చాపలమీద చేరారు. 'ఇవాళ మనం కట్ థ్రోట్ బ్రిడ్జి ఆడాలని రాసిపెట్టివుంది!' అంటూ శర్మ పేక కలిపి, ముక్కలు పంచటం ఆరంభించాడు. పార్వతీశానికి నవ్వాగలేదు.

'నువ్వు నన్ను ఎన్నిసార్లు ఎగతాళి చేసినా మరేం ఫర్వాలేదు. ఆ మాటకొస్తే, నువ్వు గెలవాలనికూడా రాసిపెట్టి వుండేమోలే!' అన్నాడు గణపతి. ముగ్గురూ నవ్వుకున్నారు. వాళ్ళు సాధారణంగా ఆడేది రమ్మీ. కదాచిత్‌గా కట్ థ్రోట్ బ్రిడ్జి ఆడితే, శర్మ చిత్తయి పోవటం మామూలు. కాని మళ్ళీ శర్మతో గెలుస్తే డతనూ అది వాళ్ళతో ఎగతాళి అయిపోయినా గణపతి ఇప్పుడామాట అనకపోతే బాగుండేదేమో ననుకున్నాడు పార్వతీశం.

ఆట జోరుగా సాగిపోతోంది. శర్మ కూతురు దొడ్డివాకిట్లో నిలబడి ఏదో తింటూ, వాళ్ళని చూస్తోంది 'దా! దా!' అన్నాడు పార్వతీశం. ఆ పిల్ల రానన్నట్టుగా తల అడ్డంగా ఆడించింది. కాని మెల్లగావస్తూ, కాటేపరాసిన చారెడు కళ్ళతో పార్వతీశానికి అందకుండా ఎడంగా పోయి తండ్రిదగ్గిరికి చేరి, ఆటలో మునిగివున్న శర్మవళ్ళో కూచుంది. శర్మ దృష్టి మరల్చి కుమార్తె చేతిలో పకోడీ కనిపించగానే, దొడ్డి వాకిలివేపు చూశాడు. అతని భార్య ఓ పళ్ళెంతో ఆ వాకిట్లో నిలబడివుంది. శర్మ లేచివెళ్ళి ఆ పళ్ళెం తెచ్చి మూడు ప్లేట్లు పకోడీలూ, ఇంకో మూడుకప్పుల కాఫీ, మూడుగ్లాసుల మంచి నీళ్ళూ అలా ఒకరిపక్కన పెట్టేశాడు. గణపతి ఓ పకోడీ తీస్తూ చేయి చాస్తే, శర్మకూతురు పార్వతీశం వంకా, గణపతి వంకా చూస్తూ, ఆ పకోడీని రెండోచేత్తో తీసుకుని తండ్రివళ్ళో వాలిపోయింది!

స్నేహితులు ఫలహారంచేస్తూ ఆట సాగి

# రు. 20/-లకు ట్రాన్సిస్టర్



ఎక్కువ సరసమైన ధరలలో ... అమెరికన్ పద్ధతిపైన రు. 20/-లకే సరి కొత్త ఆల్‌వరల్డ్ 3 బ్యాండ్ ట్రాన్సిస్టరును పొందండి. ఆర్డరు ఇంగ్లీషులో నేడే వ్రాయండి.

CEYLON TRADERS
(WAP-22)
Post Box 1257, DELHI-6



భద్రతకు, రక్షణకు పోర్టబుల్ 50 షాట్ పిస్టల్ లైసెన్సు అక్కర్లేదు. అమెరికన్ మోడల్. దొంగలు క్రూరమృగాలనుండి రక్షించుకోండి. సిక్స్ ప్రయాణాలు ... కాలక్షేపము ... గకరమైనది. ఆటోమేటిక్ 50 షాట్లు



విర్మాణమునందు ... నిప్పు రవ్వలు మిమ్ము అపాయమునుండి రక్షిస్తుంది. జర్మన్ మోడల్ నెం. 99 50 షాట్లతో సహా రు. 15.50 వి.పి.పి చార్జీలు రు. 2.50 తోటా కేసు రు. 3.50 అదనం షాట్లు ... ప్రత్యేక తగ్గింపు.

ATLAS CO ( -16)
P. O. Box 132) Delhi-6



ట్రాన్సిస్టర్లు

అంబాసిడర్ కారులకు మాత్రం ఉపయోగపడు 7 ట్రాన్సిస్టర్ మీడియం వేవ్ కార్ రేడియో లభించును. కార్ ఏరియల్ అనవసరం. తేలికగా పెట్టుకొని, పనిచేయించవచ్చును. ధర రు. 165 పన్నులు అదనం.

Savit Electronic Corporation
41/21, Prakasam Road,
Governorpet, Vijayawada 2.
ఫోన్ నెం. 7081.


ఉత్తరాలు రాసేవారికి మనవి: ఉత్తరాలు వీలయినంత చిన్నవిగా ఉండాలి! కాగితానికి ఒకవయిపునే రాసి ఉండాలి రాసినవారి పేరు, చిరునామా తెలుగు అక్షరాలలోనే రాయాలి. వీలయినంత దాకా ఇంగ్లీషు, ఇతర భాషల అక్షరాలు వాడవద్దని లేఖకులకు మనవి చేసుకుంటున్నాము. (సం)

# శర్మ పంతు

సాగించారు. కాని గణపతిమాట నిజం కాలేదు—శర్మ ఆట చెప్పినప్పుడల్లా ఓడిపోతున్నాడు! పార్వతీశం, గణపతి తమ ఆటలు ఓసారి ఓడినా మరోసారి గెలుచుకుంటున్నారు. శర్మ ఒక్కసారిగా కూతుర్ని పక్కన కూచోపెట్టి పేక కలిపి, ముక్కలు పంచాడు. ఆ పిల్ల ముఖం చిన్నబుచ్చుకుని ఇంట్లోకి వెళ్ళిపోయింది. తన ముక్కలు తీసిచూసి శర్మ తనదేం లేదన్నాడు. పార్వతీశం, గణపతి పోటీపడి చివరకు గణపతి ఫోర్ స్పేడ్సుతో, కిందిముక్కలు తీసుకున్నాడు. శర్మ ఇస్పేటు నాలుగు దిగాడు! సరిగ్గా, కిందిముక్కలు పరిచాడు గణపతి. శర్మ దభాలున బచ్చలిమడి పక్కనే కనిపించిన చిన్నరాయిని తీసి విసిరాడు. అది చూశారు గణపతి, పార్వతీశం. ఆ రాయి ఇంటిగోడ పక్కగా పరిగెత్తిపోతున్న ఎలికకు తగిలింది. ఆ ఎలిక రెండుసార్లు గిజ గిజ కొట్టుకుని మరి కదల్లేదు! శర్మ నివ్వెరపోయాడు. అసలా రాయి ఆ ఎలికకు తగులుతుందని అతను అనుకోలేదు. ఎలిక చచ్చిందా అని ముగ్గురికీ ఒకేసారి అనుమానం వచ్చింది. అయిదుగజాల దూరంలో రాయిదెబ్బకు చర్మం చీల్చుకుపోయి కదలకుండా పడివున్న ఎలిక, ఇంకా బతికివుందట మేమిటి—ముగ్గురూ ఆశ్చర్యపోయినారు.

'యముగురి శర్మా—దెబ్బకు చంపేశావు ఎలికని!' అన్నాడు పార్వతీశం.

'నువ్వా రాయిని దానిమీదకు ఎందుకు విసిరినట్టు?' అన్నాడు గణపతి.

'ఏం లేదు – బెదిరిద్దామనే!' అంటూ శర్మ చచ్చిన ఎలికని ఓ బాదం ఆకుతో పట్టుకుని తీసుకువెళ్ళి, వీధిలో పారేసి వచ్చాడు. ఎక్కణ్ణుంచి వస్తోందో ఓ తెల్లపిల్లి బచ్చలి దుబ్బులకు అవతలగా వెడపైకెత్తి, గోడమీద కూచుని తెగ అరుస్తున్న కాకివంక చూస్తూ, పొట్లపాదు వెనుక చేరి 'ఆహారం కాకపోయినా ఫలహారమైనా దొరకదా' అన్న ఆశతో అక్కడ తిష్ఠ వేసింది!

'ఆ ఎలికకు నీ చేతిలో అలా చావు రాసిపెట్టి వుందోయ్—సమయానికి నీకా రాయికూడా దొరకాలా!' అన్నాడు గణపతి.

'ఏదో నీ వాహనాన్ని నాశనం చేసినట్టు మాట్లాడతా వేమిటోయ్—వెధవ ఎలిక!' అన్నాడు పార్వతీశం. శర్మ బలహీనంగా నవ్వాడు!

హాయిగా వీస్తున్న గాలి విజృంభించటం ప్రారంభించింది. పేక ముక్కలు ఎగిరిపోకుండా వాళ్ళు కాస్సేపు ప్రయత్నించి చూశారు కాని లాభం లేకపోవటంతో, చాపలతో, పేకముక్కలతో, గ్లాసులు, ప్లేట్లు వగైరాలతో ముగ్గురు స్నేహితులూ ఇంట్లోకి వెళ్ళిపోయారు.

* * *

రాత్రి పదకొండుగంటలు దాటినా శర్మకు నిద్రరాలేదు. ఏదో పుస్తకం తీసుకుని ఎంత చదివినా నిద్ర పట్టలేదు... అదో చచ్చు ఎలికే కావచ్చు—భారత ప్రజల ఆహారానికి ప్రబల శత్రుకోటిలో ఓ భాగస్వామి కావచ్చు—కాని—అతను విసిరిన రాయికే, అది ఉబుక్కున చావాలా? అతనింతవరకూ ఏ ప్రాణినీ రక్షించకపోవచ్చు—కాని ఏ ప్రాణినీ కావాలని నాశనం చెయ్యలేదు. బుద్ధి తెలిసింతర్వాత అతని చేతుల మీదగా అంత దారుణహత్య జరగలేదు—మరి ఆ ఎలికనైనా చంపాలని అతను రాయి విసర్లేదుగా... కరుణానిధి కాకపోయినా శర్మ మనస్సులో ఆ ఎలిక అలా మెదలటానికి కారణం, గణపతి అన్నమాట!

ఆ ఎలికకు నిజంగానే తన చేతుల్లో అలా చావు రాసిపెట్టివుందా? దానికి చావు మూడటంవల్లే తాను రాయి విసిరాడా? అప్పుడింకెవరు రాయి విసిరినా అది చచ్చేదా? ఆ రాయి దెబ్బకు అది చచ్చేదే కాదు... గోడకు, రాయికిమధ్య నలిగి, చర్మం చీల్చుకుపోయి, చచ్చింది అది.. అప్పుడా గోడ లేకపోతే ఆ ఎలిక అప్పుడక్కడికి రాకనేపోతే ...ఎన్నడూ అయిదు అడుగుల దూరంలో గోలినికూడా కొట్టలేని తనకు అయిదుగజాల దూరంలో పారిపోయే ఎలికను చంపే గురిరావటం ఆశ్చర్యం—గణపతి మాట అలా నిజంకావటం శర్మకు నచ్చలేదు!

'మ్యావ్!'

శర్మ ముఖం తిప్పి చూశాడు. హాలుకు, గదికీ మధ్య గడపతో కూచుని తెల్లపిల్లి 'హా నోట్లో అన్నం తీసేసినవాడా! ఇప్పుడు

బాగతి ఏమిటి?' అన్నట్టు శర్మవంక చూస్తూ మరోసారి 'మ్యావ్!' అంది. శర్మ చేయి విసిరి పిల్లిని బెదిరించాడు. 'బెదరలే!' అన్నట్టు పిల్లి శరీరం కుదించుకుంది—పైన పెంకుల్లో కిచకిచ శబ్దం వినిపిస్తే ప్రేమగా అటు చూసింది—కాని అక్కణ్ణించిమాత్రం కదల్లేదు. శర్మ లేచి కూచుని పుస్తకం విసిరినట్టు నటించాడు. 'హరి కిరాతకుడా!' అన్నట్టు పిల్లి కళ్ళెర్రచేసి, అతన్ని శపిస్తూ అవతలికి వెళ్ళిపోయింది.

శర్మ మళ్ళీ పడుకున్నాడు. 'అసలా ఎలిక ఎలాగూ ఆ పిల్లి నోట్లో పడదే! ఎక్కడయినా పగలు ఎలిక, బెదిరినట్టుగా పారిపోతూనే వుంటుంది. అయినా మనిషి ఎందుకని ఎలుకల్ని, పిల్లుల్ని అలా బెదిరిస్తాడు? ఒక్కోసారి మనుషులు చేసే పన్లకు అర్థం వుండదు' అనుకున్నాడు శర్మ. ఒకవేళ ఈ పిల్లికూడా చావదుకదా—శర్మకు భయంవేసింది! ఎలా చస్తుంది? అతనేం దాన్ని కొట్టనుకూడా లేదు. చస్తే చావనీ—చచ్చేవాళ్ళను ఎవరూ రక్షించలేరు అనుకున్నాడు శర్మ.

ఈ పాడు ఆలోచనల్ని మానేసి • ఎలాగైనా నిద్రపోవాలనిపించింది శర్మకు. అవతల మంచంమీద భార్య, పిల్లా నిద్రపోతున్నారు. ఆతను పుస్తకం అవతలపెట్టి, దీపం ఆర్పి పడుకుని కళ్ళు మూసుకున్నాడు...అసలు వస్తూనే పార్వతీశం తనకెందుకు గణపతి వేదాంతంతో పురి ఎక్కించటం? అది గణపతి వేదాంతంకూడా కాదు—చేతకాని ప్రతివాడూ అనాదినుంచి తెరుస్తూన్న ఓ గొడుగు! పోనీ పార్వతీశం అయినా, బావిలో పడితే ఆ బాదంపండు తినే ప్రాప్తం లేదనటమేమిటి? అది గణపతిని ఎగతాళి చెయ్యటమా? మరి తను బాదంపండు తీసి ఇచ్చాడా లేదా? బొక్కెనకు రాకపోతే ఎవరినైనా పిలిచి వరలబావిలోకి దింపి అయినా, ఆ పండునే తీయించి ఇచ్చేవాడే తాను. అంత పట్టుదల కలిగింది అప్పుడు—తలుచుకుంటే శర్మకు నవ్వు వచ్చింది.

ఆ ఉత్సాహంతోనే తను రమ్మీకి బదులు కట్‌థ్రోట్‌బ్రిడ్జి ఆటకు ముక్కలు పంచాడు. కాని అది ఆడాలని 'రాసిపెట్టి వుంది' అని అనకుండా వుండాలిసిందాతను? అంటేమాత్రం—పరీక్షించినట్టుగా తాను ఓడిపోవాల్సా? కాని నిజానిక్కి తాను గెలవాలని రాసిపెట్టివుందేమోలేననే అన్నాడు గణపతి. అది—ఎగతాళా? అయితే ఎన్నిసార్లు పార్వతీశం ఎగతాళి చెయ్యలేదు? ఎన్నిసార్లు తాను గణపతి చాదస్తాన్ని ఎగతాళి పట్టించలేదు? కాని గణపతి ఎగతాళిగా అనటం, తాను ఓడిపోతూ రావటంవల్ల పట్టుదల—అదే కసి—పెరిగిన మాటనిజం! ఆ కసిమీదేనా రాయి విసిరింది?

గణపతి చాదస్తం అతని కెప్పుడూ మింగుడు పడకుండానే వుంది. కాని అదొక గొప్ప విషయం అయినట్టు; దాంతో గణపతి బాగుపడుతున్నట్టు, అది తనకు చేతకానట్టు అసూయతో కసి దేనికి? మనుషులు అర్థంలేని కసి పెంచుకుంటా రెందుకో! డబ్బులో, హోదాలో, తెలివితేటల్లో, రూపురేఖల్లో, సాధ్యమయిన ఇతర విషయాలన్నిట్లో సమానులయితేనే కసి వుండదా? లేక మనతో సమానమా అని ఇంకా కసిగా వుంటుందో! మరి ఈ సమానమనేది నేతి బీరకాయలో నెయ్యి! ఇక తక్కువ వాళ్ళయితే అసహ్యం—ఎక్కువ వాళ్ళయితే గౌరవం, లోపల కసి! ఇదంతా తెలిసిన వాళ్ళయితేనే—కొత్త వాళ్ళమీద ఎలాగూ గౌరవం వుంటుంది, వాళ్ళు పాతబడే దాకా!

ఎప్పుడు ప్రారంభమైందో వానజల్లు కిటికీలోంచి పడుతుంటే శర్మ చప్పున లేచి కిటికీ మూసి మళ్ళీ పడుకున్నాడు.

జ్యోతిష్యంలో సుతరాం నమ్మకం లేని వాళ్ళు కూడా గృహ ప్రవేశాలప్పుడు, పెళ్ళిళ్ళప్పుడు ముహూర్తం పెట్టిస్తుంటారు! జ్యోతిష్యంలో శర్మకు ఒకటి రెండు దాఖలాలున్నయ్యి. కాని ఈ రాసి పెట్టటమే అర్థం కాకుండా వుంది. ఎవరీ రాసిపెట్టేది—భగవంతుడా—అష్టదిక్పాలకులా—నవగ్రహాలా — ముక్కోటి దేవతలా—శతకోటి నక్షత్రాలా—ఎవరు? ఈరాసి పెట్టటానికి మొదలూ, చివరా ఎక్కడ? మనిషి పుట్టినప్పటినుంచీ మరణించే వరకూ అంతా రాసిపెట్టి వుంటుందా లేక సందర్భాన్ని బట్టి సమయానుకూలంగా రాయబడుతూ వుంటుందా? కలిసివస్తే అదృష్టం, కలిసి రాకపోతే ఖర్మ అవుతూ వుంటుందా? ఒకరి అదృష్టం మరొకరి ఖర్మ కాగలుగుతున్నప్పుడు ఎవరు దేనికి బాధ్యులు? ఏమిటీ మాయ? ఈరాసి పెట్టటం సంఘానికీ, దేశాలకు కూడా వుంటుందా? ప్రపంచంలో, దేశాల్లో, జీవితాల్లో ఇంత అభివృద్ధి కేవలం అదృష్టం, రాసి పెట్టటం వల్లనే జరుగుతోందా? శర్మ లేచి కూచున్నాడు. గణపతి చెప్పేది వట్టి తప్పుల తడక—తేలిపోయింది!

...కాని అవాళ హోటల్లో తనచేతిలోంచి జారినగాజు గ్లాసు కిందపడి పగల్లేదు! 'దీనికేమంటావ్?' అని గణపతి రెట్టించాడు. అప్పుడు కొంత ఆశ్చర్యం కలిగినా అదొక చచ్చు ఉదాహరణగా భావించాడు తను. ఆ గ్లాసు ఎందుకు పగిలి వుండక పోవచ్చో తను, పార్వతీశం వాదిస్తే గణపతి అంగీకరించాడు కూడా. కాని ఆ మధ్య ఎవరో చిన్నపిల్ల, రెండో అంతస్థునుంచి పడిపోయి చెక్కు చెదరకుండా బతికి బాగుపడుతూ వుండటం పత్రికలో పడితే, తనే ఆ సంగతి గణపతికి చూపించాడు.

'ఆ పిల్ల ఎలా బతికివుందో చెపుమా?' అని గణపతి అడిగితే, తాను చెప్పలేక పోయాడు. ఆ పిల్ల బతకాలని రాసివుంది!' అని గణపతి, చివరకు సినిమాలో జ్ఞానికి మల్లే చెప్తే, తను అప్పుడు ఒప్పుకోక తప్పలా, నమ్మకం లేకపోయినా!

అంటే మనిషి మేధకు, వూహకు తెలిసేలా నిదర్శనం కావాలి అన్నమాట! రుజువు లేకపోతే అబద్ధం అంటాడు. వాఖలా కనిపిస్తే ఏదో తెలీని కారణం వుందంటాడు—కాని నమ్మడు! మరి ప్రతి దానికీ ఏదో కారణం వుంటుందాయె. అయితే మనకు తెలిసినదాని కంటె తెలియనిదే లక్ష రెట్లు వుందంటారు పెద్దలూ, తెలిసిన పిన్నలూ! మరి గణపతి వాదన అందరికీ వర్తిస్తుందా లేక చేసుకున్న వారికి చేసుకున్నంత అవుతుందా? కాని గణపతికా నమ్మకం వుండటానికీ, తన ఎదుట ప్రకటించటానికీ అతని కధికారం లేనట్టుగానే వుంది, తన ప్రవర్తన ఎంత సేపటికీ! శర్మకు నిద్ర రాక పోవటానికి తోడు చిరాకు ఎక్కువయింది — అతను బనీను విప్పి అవతల పడేశాడు!

శర్మ మనస్సు పరి పరి విధాల పోవటం వల్ల శరీరమంతా బిగపట్టి వట్టయింది. గాలికోసం లేచి కిటికీ తెర

తుండగా పక్కన గోడమీద, ముఖాని కెదురుగా బల్లమీద, రేడియం డయలు గడియారం కనిపించింది. అయిదుంబావు! తెల్లారగట్ల అయిదుంబావు? నమ్మలేక గడియారం చెవిదగ్గిర పెట్టుకున్నాడు. గడియారం సలక్షణంగా సాగిపోతోంది!

కిటికీ తెరిచాడు. ఇంకా వాన కురుస్తోంది. కొద్దిగా జల్లు అతనిమీద పడితే హాయిగా వుంది! బయటికి వెళ్ళి— చిన్నప్పటిలాగా గెంతులు వేయకపోయినా— హాయిగా కాస్సేపు తడిస్తే? పక్క ఇళ్ళ వాళ్ళెవరూ ఆ వానలో చూడరు కాని వెలుతురు బాగా రాకుండానే తడవటం మంచిది!

శర్మ కిటికీ మూసి, పైజామా తీసి తువ్వాలు చుట్టుకుని హాలు లోకి వచ్చి, దొడ్డితలుపులు తీసి బైటికి వచ్చి, తలుపుల్ని మళ్ళీ మూశాడు. శరీరమంతా వానపడి ఇంకా హాయిగా ఒక్కసారి ఝల్లు మనిపించింది. ఆ వానలో కాస్సేపు అటూ ఇటూ తిరిగాడు. చిన్నప్పుడు ప్రతిసారీ గొడుగు పారేసుకోవటం, స్కూలు నుంచి వానలో రావటం—ఆ సరదా జ్ఞాపకం వచ్చింది! అప్పటికి మళ్ళేనే వానలో స్నానంకూడా చేస్తే? అప్పుడెంతో బాగుండేది—పైగా ఇప్పుడు చివాట్లు పెట్టే వాళ్ళుకూడా లేరు. వాన తగ్గుతున్నట్టు వుంది — వెలుతురుకూడా వచ్చేస్తోంది — ఛలో!

శర్మ బావిదగ్గిరి కెళ్ళాడు. బొక్కెన్లో వాననీళ్ళు పారబోసి, దాన్ని గిలకమీదగా బావిలోకి వేశాడు. ఎక్కణ్ణుంచో 'మ్యావ్' మని వినిపించింది. శర్మ నిర్ఘాంతపోయి బావిలోకి చూశాడు. ఆ కొద్ది వెలుగులో తెల్లపిల్లి బావిలో ఈదుతూ కనిపించింది! అతను చూడటం చూసి అది ఇంకోసారి బలహీనంగా అరిచింది. శర్మ గుండె జల్లుమంది. బొక్కెన్ను జాగ్రత్తగా పిల్లిదగ్గిరికి చేర్చాడు. నీళ్ళున్న బొక్కెనలోకి చేరక పిల్లి, బొక్కెనపైన తాడును నోటితో కరచుకుంది!

అలా పైకి లాగితే సగందూరం వచ్చి, బెదిరి మళ్ళీ బావిలోపడితే పిల్లి? ఈసారి తప్పకుండా మునిగి, చచ్చి మరీ తేలుతుంది—కాని తప్పదు! ఓ క్షణం చూశాడు—పిల్లి బొక్కెనతాడు వదల్లేదు

శర్మ పిల్లివంక చూస్తూ బొక్కెన్ను మెల్లిగా పైకి లాగాడు. వర్షంవల్ల గిలక చప్పుడులేదు. ఏ క్షణంలో భయపడి పిల్లి బావిలో పడుతుందోనవే అతని భయం! శర్మ లాగుతూవుంటే, తాడును కరచుకున్న పిల్లి ఆ బొక్కెన పక్కగా వేళ్ళాడుతూ, బావి బొడ్డుపైకి వచ్చేసింది. ఇక ఆ పిల్లితో ఆ బొక్కెన్ను ఇవతలికి తీయాలి. చేయి చాస్తే పిల్లి భయపడి; ఇంత శ్రమ వృథాకాదు కదా? పిల్లివంక చూస్తూ తీస్తున్న బొక్కెన, పిల్లితో బొడ్డు ఇవతలికి రాగానే శర్మ ఒక్కసారిగా వాటిని బావి చప్టామీద జారవిడకుండా వుండలేకపోయాడు! అంతవరకూ వూపిరి పీల్చకపోవటంవల్ల ఒక్కసారి గాలి పీల్చగానే ఆయాసం వచ్చింది.

శర్మ చూపంతా పిల్లిమీదే వుంది. బొక్కెన వొరిగి నీళ్ళు కారిపోయినా, పిల్లి ఆ తాడు వదల్లేదు. దాని భయం దానిది—మరి తియ్యని ప్రాణం! చుట్టూ ఓసారి చూసి నీళ్ళు కనిపించక పోగానే, మెల్లిగా నోరు తెరిచితాడు వదిలింది పిల్లి. లేచినిలబడింది. వళ్ళు దులుపుకుంది. యుద్ధంలో గెలిచి విశ్రాంతి చెందిన వీరుడిలా, మెల్లిగా నడిచిపోతోంది!

శర్మకు ఒక్కటే అనుమానం—అది ఎలా బావిలో పడ్డది? చుట్టూ చూశాడు. ఇంట్లో గోడమీదగా పక్కవాళ్ళ భాగంలోకిచేరి, ఏదో ఎలికను పట్టుకోబోతూ కిటికీ మీదికెగిరి, పట్టు తప్పి చువ్వల్లోంచి స్నానాల గది రేకులమీదపడి, జారుతూ వచ్చి బావిలో పడివుండాలి— అంతా క్షణంలో అయిపోయివుండాలి. కావి ఏరాత్రివేళ పడ్డదో, ఎప్పటినుంచి బావిలో, వానలో ఈదుతూ అరుస్తోందో—శర్మ వళ్ళు జలదరించింది!

వెలుతురు బాగా వచ్చేసింది. ఎప్పుడు వెలిసిందో వానకూడా లేదు—గాలి మాత్రం వీస్తోంది. శర్మకు తాను స్నానానికి రావటం జ్ఞాపకం రాగానే చప్పున చలి వేసింది! మరి ఇంతకూ తాను వచ్చింది—!? అవతల ఆ పిల్లి ఆగుతూ, వళ్ళు దులుపుకుంటూ వెళ్ళిపోతోంది. ఎవరో తనకు తెలియకుండా తన చేత మహా వాజ్ఞానుగా పని చేయించుకున్నట్టు వుంది శర్మకు! అతను దొడ్డివాకిలి చేరగానే, లోపల గడియ లేకుండా వున్న తలుపుల్ని ఆశ్చర్యంతో తెరుస్తూ అతని భార్య బయట తుండుగుడ్డతో తడిసి ఏదో ఆలోచిస్తున్న భర్త కనిపించగానే, నిద్ర మొహం అంతా పోయి ముంగురుల్ని వెనక్కు తోసుకుంటూ, చిరునవ్వుతో అందంగా శర్మ వంక చూసింది!

